క్లుప్తంగా

ప్రజాపాలనలో సమన్యాయం



నర్సంపేట : ప్రజాపాలనలో ప్రజలకు సమన్యాయం జరుగుతుందని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు నెక్కొండ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, రెడ్లవాడ సొసైటీ వైస్ చైర్మన్ రోజనాల సంపత్‌కుమార్ శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నర్సంపేట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాధవరెడ్డి.. సంపత్‌కుమార్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ పట్టణ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, సీనియర్ నాయకులు చెన్నకేశవులు, మార్కెట్ డైరెక్టర్ మైపాల్‌రెడ్డి, వెంకటాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు వంగాల బాబు, నాయకులు అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో వాగ్వాదం

వర్ధన్నపేట: వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయం సమావేశపు హాలులో కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ ఆంగోత్ అరుణ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎజెండా ప్రకారం గణపతి నిమజ్జన ఏర్పాట్లు, దసరా ఉత్సవాల ఏర్పాట్లపై కౌన్సిలర్లతో సమావేశంలో చర్చించారు. కాగా, అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్ల నడుమ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుని పరిస్థితి ఉద్రిక్తంగా మారినట్లు సమాచారం. చేసిన పనులకు బిల్లులు చేయకుండా, నిధులు విడుదల చేయకుండా, చేయని పనులకు బిల్లులు ఇచ్చి, తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇరువర్గాలు దూషించుకున్నట్లు తెలిసింది. విజిలెన్స్ విచారణ అనంతరం బిల్లులు చేస్తామని చెప్పడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ కార్యాలయ కాంట్రాక్ట్ ఉద్యోగి సైతం బిల్లులు బినామీగా చేయించుకున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి.

డీజేలు పెట్టొద్దు



రాయపర్తి : గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా డీజేలు పెట్టొద్దని వర్ధన్నపేట సీఐ శ్రీనివాసరావు కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండలంలోని డీజే నిర్వాహకులకు శనివారం ఆయన కౌన్సెలింగ్ చేశారు. డీజేలు పెడితే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై శ్రవణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం



రాయపర్తి : ఆర్ఎంపీల సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన బండ యాదగిరిని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు బిల్ల సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అందిస్తున్న అత్యవసర వైద్యసేవలు వెలకట్టలేనివని చెప్పారు. ఆర్ఎంపీలకు ప్రభుత్వమే శిక్షణ ఇప్పించి సేవలను మెరుగుపర్చాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లేతాకుల సుమతి యాదవరెడ్డి, నాయకులు పరుపాటి రవీందర్‌రెడ్డి, ఈదులకంటి మహేందర్‌రెడ్డి, లేతాకుల మహబూబ్‌రెడ్డి, చిత్ర మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చెన్నారావుపేట : పౌష్టికాహారం తీసుకుంటేనే గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు సంపూర్ణ ఆరోగ్యం సమకూరుతుందని హెచ్ఎం శౌరీలు తెలిపారు. పోషణ మాస వేడుకల సందర్భంగా మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో పోషకాహార పదార్థాలను శనివారం ప్రదర్శించారు. అనంతరం హ్యాండ్ వాష్, పౌష్టికాహారం తీసుకోవడంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం హెచ్ఎం మాట్లాడారు. మూడేళ్లు నిండిన చిన్నారులను వెంటనే పూర్వ ప్రాథమిక విద్యలో చేర్పాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు అరుణ, ఆశవర్కర్లు రజిత, అనిత, తదితరులు పాల్గొన్నారు.

పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నర్సంపేట రూరల్ : ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలను కాపాడేలా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ కృష్ణకుమార్ రైతులకు సూచించారు. మండలంలోని మాధన్నపేట, మహేశ్వరం గ్రామాల్లో దెబ్బతిన్న పత్తి పంటలను ఆయన శనివారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు సూచనలు చేశారు. పత్తి పంటలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో కుళ్లు రోగాలు ఆశించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 19.19.19 లేదా 13.0.45 ఐదు గ్రాముల చొప్పున కాపర్ ఆక్సీక్లోరైడ్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేసి కుళ్లును అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు అశోక్, శ్యామ్, ఇతరులు పాల్గొన్నారు.

నర్సంపేట : సిద్ధార్థనగర్‌లో గణపతికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



నెక్కొండ : గణపతి పూజల్లో పాల్గొన్న విద్యార్థులు



వైభవంగా గణపతి నవరాత్రి ఉత్సవాలు

జిల్లాలోని నర్సంపేట, రాయపర్తి, సంగెం, నెక్కొండ, పర్వతగిరి, వర్ధన్నపేట, నల్లబెల్లి, ఖానాపురం, దుగ్గొండి తదితర మండలాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు శనివారం కొనసాగాయి. పలు మండపాల వద్ద ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

-సాక్షి నెట్‌వర్క్



సంగెం : కుంకుమార్చన చేస్తున్న మహిళలు



నర్సంపేట రూరల్ : బిట్స్‌లో అన్నదానం



పర్వతగిరి : పూజ చేస్తున్న భక్తులు



రాయపర్తి : అన్నదానం చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి



ఖానాపురం : అన్నదానం చేస్తున్న ఎస్సై



వర్ధన్నపేట : లక్ష్మీపూజ చేస్తున్న మహిళలు



నల్లబెల్లి : అన్నదానం చేస్తున్న ఎస్సై



దుగ్గొండి : చాపలబండలో..

ప్రజాపాలన దినోత్సవం అర్థరహితం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు



ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సంపేట : ఈనెల 17న ప్రజాపాలన దినోత్సవం నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అర్థరహితమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి చాకలి ఐలమ్మ విగ్రహం వరకు ఆ పార్టీ మండల సమితి ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి గడ్డం యాకయ్య అధ్యక్షతన నిర్వహించిన సభలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన తెలంగాణ దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరితంగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈనెల 17న జిల్లా కేంద్రాల్లో జాతీయ జెండాలు ఎగరేయాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. అదే రోజు ప్రజాపాలన దినోత్సవంగా జరుపుతామనడం సరికాదన్నారు. బీజేపీకి తెలంగాణ విలీన దినోత్సవంపై మాట్లాడే హక్కు లేదన్నారు. సభలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, నాయకులు అక్కపల్లి రమేశ్, కందిక చెన్నకేశవులు, గన్నారపు రమేశ్, గోవర్ధనాచారి, దామెర కృష్ణ, పాలక కవిత, ఇల్లందుల సాంబయ్య, పార్థసారథి, ఐత యాకూబ్, గడ్డం నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ ఎస్‌ఓకు నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు



సంగెం : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ప్రత్యేకాధికారి కండె నీలిమ నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి విశ్వం స్కూల్‌లో యువతేజం ట్రస్ట్, కలాం విజన్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, టీచర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు ఆచార్య దేవోభవ పురస్కారం, నేషనల్ ఎక్సలెన్సీ అవార్డు అందజేశారు. అందుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ మనవడు డాక్టర్ సుబ్రహ్మణ్యంశర్మ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నట్లు తెలిపారు.

అక్రమాలు జరగలేదు : ఏపీఎం

నల్లబెల్లి : గుండ్లపహాడ్ రాజరాజేశ్వర మహిళా పొదుపు సంఘంలో అక్రమాలు జరగలేదని ఏపీఎం సునీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 27న నర్సంపేట యూనియన్ బ్యాంకు అధికారులు సంఘానికి రూ.20 లక్షల రుణం మంజూరు చేయగా 13 మంది సభ్యులు రూ.1,53,230 చొప్పున అప్పు తీసుకున్నారని పేర్కొన్నారు. 60 ఏళ్ల పైబడిన ఐదుగురి సభ్యులకు కుటుంబ సభ్యులను జామీనుగా పెట్టుకొని అప్పులు ఇచ్చారని, 2021లో మృతి చెందిన పడాల భాగ్యలక్ష్మికి సంబంధించిన అప్పు పూర్తిగా చెల్లించినట్లు వివరించారు. సంఘం తీర్మానం మేరకు ఆమె స్థానంలో కొత్తగా సభ్యురాలిని తీసుకున్నట్లు తెలిపారు. 2022లో తీసుకున్న రూ.10 లక్షల రుణంలో ఎలాంటి అక్రమాలు జరగలేదని, సభ్యురాలు సరళను సంఘం నుంచి తొలగించలేదని, ప్రస్తుతం సంఘంలో కొనసాగుతుందన్నారు. కాగా సంఘంలో అప్పు వద్దనగా ఆమెకు అప్పు ఇవ్వలేదని పేర్కొన్నారు.

సభ్యత్వ నమోదు

గీసుకొండ : మండలంలోని ధర్మారం, గీసుకొండ జెడ్పీ హైస్కూళ్లలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రతినిధులు మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్ కృషి చేస్తుందని తెలిపారు. ఉపాధ్యాయులు సంఘంలో చేరి మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు పర్వతి సత్యనారాయణ, సంగీత, శ్రీనివాస్‌రెడ్డి, నవీన్, మురళి, సర్వేశ్వర్, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతో ఏకీకృత సర్వీస్ సాధన

పర్వతగిరి : పీఆర్‌టీయూతోనే ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించగలమని జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ గఫార్ తెలిపారు. భూక్య రాములు అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల శాఖ సర్వసభ్య సమావేశానికి రవీందర్‌రెడ్డి, గఫార్ హాజరై మాట్లాడారు. బీఈడీ కలిగిన ఎస్‌జీటీలకు ఎల్ఎఫ్ఎల్ ప్రమోషన్లు, హెల్త్‌కార్డులు ఇప్పిస్తామన్నారు. మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయుల బదిలీ కోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. రెండు డీఏలు ఇప్పించే బాధ్యత యూనియన్ తీసుకుంటుందని తెలిపారు. అనంతరం యూనియన్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, అసోసియేటివ్ ప్రెసిడెంట్‌గా కుమార్, ఉపాధ్యక్షులుగా అనిల్, కల్పన, కార్యదర్శులుగా జలంధర్, రాణి రుద్రమదేవి ఎన్నికయ్యారు.

అంత్యక్రియలకు విరాళాల సేకరణ

ఖానాపురం : మండలంలోని ధర్మారావుపేటకు చెందిన సుగుణమ్మ (93) అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందగా ఆమె అంత్యక్రియల కోసం విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు కూస కుమార్, ప్రధాన కార్యదర్శి తోట రవి ఆధ్వర్యంలో గ్రామంలోని దాతల నుంచి సేకరించిన రూ.25 వేలు అందజేశారు.

ఆర్థికసాయం

నర్సంపేట : పట్టణంలోని సర్వాపురం ప్రాంతానికి చెందిన జెట్టి మొగిలి ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్ చేతుల మీదుగా శనివారం రూ.16 వేల సాయం అందజేశారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. మొగిలి మృతి బాధాకరమన్నారు. మృతుడి భార్య అనూష, పిల్లలు అక్షిత, భవ్యశ్రీలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వెంకటాపురంలో..

దుగ్గొండి : మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన నైనబోయిన కృష్ణమూర్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి మెపా నాయకులు రూ.16 వేల సాయం అందజేశారు. తొలుత మృతుడి భార్య కవిత, కూతురు నాగేశ్వరిలను పరామర్శించారు.

బియ్యం అందజేత

చెన్నారావుపేట : మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామానికి చెందిన పటాన్ చిన్న మదార్ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ననుమాస వీరస్వామి ఆధ్వర్యంలో 50 కిలోల బియ్యం అందజేశారు.

తిర్మలాయపల్లిలో..

రాయపర్తి : మండలంలోని తిర్మలాయపల్లికి చెందిన నల్లతీగల నర్సింహరాములు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి వివేకాంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మడిపెద్ది నాగార్జున్ ఆధ్వర్యంలో బియ్యం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

బీజేపీ పాలనలోనే దేశాభివృద్ధి



నర్సంపేట : మాట్లాడుతున్న పాపారావు



గీసుకొండ : మాట్లాడుతున్న వెంకటరమణ

నర్సంపేట : బీజేపీ పాలనలోనే దేశ అభివృద్ధి జరుగుతోందని ఆ పార్టీ జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జ్ పాపారావు తెలిపారు. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో శనివారం నిర్వహించిన నియోజకవర్గ సభ్యత్వ నమోదు సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే రెండు నెలలు కార్యకర్తలు సమష్టిగా శ్రమించి సభ్యత్వ నమోదు లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కిందిస్థాయిలో ప్రజాప్రతినిధులను గెలిపిస్తేనే పార్టీ బలం పెరుగుతుందని చెప్పారు.

ధర్మారంలో..

గీసుకొండ : మండలంలోని ధర్మారంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై ఓబీసీ, బీసీ, మహిళ, ఎస్సీ, యువ, ఎస్టీ, కిసాన్ మోర్చాల అధ్యక్షులు, నాయకులతో శనివారం నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ మాట్లాడారు. సభ్యత్వ నమోదుకు అనుబంధ మోర్చాల ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. సమావేశాల్లో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, కుసుమ సతీష్, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు ఎడ్ల అశోక్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రత్నం సతీశ్, వన్నాల శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి, నర్సంపేట కాంటెస్ట్ అభ్యర్థి పుల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో సైబర్ నేరాలకు అడ్డుకట్ట



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై రఘుపతి

ఖానాపురం : ప్రజలు అవగాహన పెంచుకోవడం ద్వారా సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేయొచ్చని ఎస్సై రఘుపతి తెలిపారు. మండలంలోని దబ్బీర్‌పేటలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. బ్యాంకు ఖాతాల నంబర్లు, పాస్ వర్డ్‌లు, ఓటీపీలు, తదితర కీలకమైన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చినా, సైబర్ నేరం బారిన పడినా సత్వరమే పోలీసులను సంప్రదించాలని సూచించారు. మొబైల్‌కు అవసరం లేని లింక్‌లు వస్తే వాటిని ఓపెన్ చేయొద్దని చెప్పారు. యువత వ్యసనాలకు బానిస కావొద్దని, ఆదర్శవంతమైన జీవితం గడిపే దిశగా ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. యువతులు అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట వేసి నేరాలను నివారించే దిశగా పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. సమావేశంలో పోలీస్ కానిస్టేబుళ్లు సుమన్, రమేశ్, సీతారాం, తదితరులు పాల్గొన్నారు.

ఆపత్కాలంలో ప్రథమ చికిత్స కీలకం



అవగాహన కల్పిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు

నర్సంపేట రూరల్ : ఆపద కాలంలో ప్రథమ చికిత్స కీలకమని బాలాజీ టెక్నో స్కూల్ ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ తెలిపారు. అంతర్జాతీయ ప్రథమ చికిత్స దినోత్సవాన్ని పురస్కరించుకుని నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని ఆ స్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్‌సీసీ కేడెట్లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు, వేసవిలో వడదెబ్బ, గుండెపోటు తదితర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రథమ చికిత్స అవసరమని చెప్పారు. ప్రథమ చికిత్సపై అవగాహన లేకపోవడంతోనే పలువురు ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. ఎన్‌సిసి క్యాడెట్లు సోషల్ సర్వీస్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ యాక్టివిటీలు నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ రియాజుద్దీన్, సీనియర్ కేడెట్లు అభిలాష్, సిద్ధార్థ్, సహస్రశ్రీ, దీపిక, తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు అండగా 'సఖి'



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వప్న, తదితరులు

గీసుకొండ : గృహహింస, బాల్యవివాహాలు, తదితర సమస్యలతో సతమతమవుతున్న బాధిత మహిళలు, బాలికలకు సఖి కేంద్రం అండగా నిలుస్తుందని లీగల్ కౌన్సిలర్ శోభారాణి తెలిపారు. మండలంలోని మచ్చాపూర్‌లో సఖి కేంద్రాల సేవలపై స్థానిక గ్రామైఖ్య సంఘం సభ్యులకు అవగాహన కల్పించేలా శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళలు, బాలికలపై అనేక రకాల నేరాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో మహిళలు, బాలికలకు రక్షణ కల్పించడంతోపాటు సత్వరమే న్యాయం అందించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాలు ఏర్పాటు చేశాయని చెప్పారు. బాధిత మహిళలు హెల్ప్‌లైన్ నంబర్ 181కు ఫోన్ చేస్తే తక్షణ సాయం అందుతుందని తెలిపారు. మహిళలు గృహహింస, బాల్యవివాహాలు, పోక్సో, తదితర చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. అనంతరం సఖి సేవల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కేసు వర్కర్ స్వప్న, వీఓఏ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీఈటీ, ఉపాధ్యాయులు

నర్సంపేట : జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన హనుమకొండలో జరిగిన అండర్-12, 14 సంవత్సరాల బాలికల విభాగంలో పట్టణంలోని మహాత్మ జ్యోతిరావు పూలే (ఎంజేపీ) స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మంగ తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులను శనివారం ప్రిన్సిపాల్, పీఈటీ శిరీష, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. పరుగు పందెంలో వర్షిత, సహస్ర, నయనిక, అక్షర గోల్డ్ మెడల్ సాధించగా షాట్ పుట్ విభాగంలో రక్షిత, లేఖ సిల్వర్ మెడల్ సాధించారని తెలిపారు.

బేస్‌బాల్ పోటీలకు నలుగురు..

వరంగల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి బేస్ బాల్ పోటీల్లో నర్సంపేటలోని విజడమ్ హైస్కూల్‌కు చెందిన జయంత్, సల్మాన్, రాణి, గౌతమి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్మల్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారని జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి ముఖర్జీ తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్ జహంగీర్, డైరెక్టర్ జావెద్, అకాడమిక్ అడ్వైజర్ నాజియా ఇక్బాల్, ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ ఫహీమ్ సుల్తానా, వైస్ ప్రిన్సిపాల్ ప్రకాశ్, కోచ్ ప్రశాంత్‌కుమార్, పీఈటీలు రియాజుద్దీన్, రాజేశ్, పృథ్వీ, వీరభద్రయ్య, మధు, మంజుల, శ్రీలత, రాజేశ్ అభినందించారు.

విద్యాసంస్థల్లో వేడుకగా హిందీ దివస్

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ అధ్యక్షతన హిందీ దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నవీన్ మాట్లాడారు. భారతదేశంలో హిందీ బాషను అత్యధిక శాతం జనాభా అర్థం చేసుకుంటారని తెలిపారు. విద్యార్థులు హిందీ బాష మీద పట్టు సాధించాలని సూచించారు. అనంతరం వర్ధన్నపేట కళాశాల ప్రిన్సిపాల్ పోచయ్య మాట్లాడారు. హిందీ భాష నేర్చుకొని విద్య, ఉద్యోగ అవకాశాలను పొందాలని కోరారు. హిందీ విభాగం అధ్యక్షురాలు డాక్టర్ బి.గాయత్రి మాట్లాడుతూ హిందీ దివస్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి సత్యనారాయణ, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కందాల సత్యనారాయణ, పరీక్షల నియంత్రణ అధికారి కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని బానోజీపేట జెడ్పీ సెకండరీ స్కూల్‌లో హిందీ తొలి అక్షర ఆకారంలో విద్యార్థులను కూర్చోబెట్టారు.

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస, పాటలు, నృత్య, కవితల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

పర్వతగిరి : మండల కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌లో హెచ్ఎం పాక రమేష్‌బాబు మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఉపన్యాస, చిత్ర లేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజిత, రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేశారు. హిందీ ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ కంది గోపాల్‌రెడ్డి, హెచ్ఎంలు సరళ, ప్రభాకర్‌రావు, అండెం కరుణాకర్, జ్యోతి, ఉపాధ్యాయులు బండారి భిక్షపతి, బొనగాల రమేష్, కుమారస్వామి, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు రాత పరీక్ష, నాటిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఝాన్సీలక్ష్మి మాట్లాడారు.

నల్లబెల్లి : మండలంలోని శనిగరం హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం కొండా నటరాజ్ మాట్లాడారు. విద్యార్థులకు హిందీ భాషపై ఉపన్యాసాలు పోటీలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హిందీ పండిట్ సయ్యద్ అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సుశీల, తదితరులు పాల్గొన్నారు.